సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం । 14 । జనవరి । 2025



ఆరు పదుల వయస్సులోనూ తగ్గేదేలే!
ఆరుపదుల వయస్సు దాటితే చిన్నపని చేసినా అలసట వస్తుంది. అయితే రాజంపేట క్రికెట్ క్లబ్ మాజీ క్రీడాకారుల్లో భోగిపండుగ రోజు అలసట ఏమాత్రం కనిపించదు. - 8లో



పోటా పోటీగా బండలాగుడు పోటీలు
సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి బండలాగుడు పోటీలు నిర్వహించారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0 /18.6
జిల్లాలో సోమవారం 18.6 – 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో నియామకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో జిల్లాకు చెందిన పలువురిని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేట్ వలంటీర్స్ విభాగం ఉపాధ్యక్షుడిగా ఎర్రబోతుల శివ భాస్కర్ రెడ్డి, స్టేట్ మున్సిపల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా రాచపల్లి వెంకట సుబ్బారెడ్డి, స్టేట్ మున్సిపల్ విభాగం కార్యదర్శిగా పల్లారెడ్డి భాస్కర్, స్టేట్ మున్సిపల్ వి గ్ జాయింట్ సెక్రటరీగా డి వెంకటసుబ్బయ్య లను నియమించారు.

విద్యుత్ బిల్లుల దహనం



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ చార్జీలను పెంచి కూటమి ప్రభుత్వం ప్రజల్ని నిలువునా మోసం చేసిందని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ ధ్వజమెత్తారు. దీనికి నిరసనగా సోమవారం విద్యుత్ బిల్లులను భోగి మంటలలో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడేమో అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే బిల్లుపై అదనంగా 60 నుంచి 120 శాతం దాకా భారం వేసి వినియోగదారుడి నడ్డి విరిచారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల ప్రతి వినియోగదారుడికి రూ.10 వేల నుండి రూ. 25వేల దాకా అదనపు భారం పడబోతుందన్నారు. విద్యుత్ సంస్కరణలపై కూటమి విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నగర కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, గోవిందు విజయ్ సరిత తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పీరయ్య స్వామి ఆరాధనోత్సవాలు

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లె గ్రామం పీరయ్యమఠంలో 219 సంవత్సరాల క్రితం సజీవ సమాధి అయిన పీరయ్య స్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నాలుగో పీఠాధిపతి మఠం నాగలింగమయ్య ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు మంత్రి మండిపల్లి పీరయ్యస్వామి సుప్రభాతం పుస్తకావిష్కరణ రాంప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా జరగనుంది. రాత్రి 8 గంటల నుంచి అఖండ భజన, చెక్కభజన, కోలాటం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం మౌలాలి జెండా ఊరేగింపు జరుగుతుంది.భక్తులు ఆరోధనాత్సవాల్లో పాల్గొనాలని మఠాధిపతి వారసులు తెలిపారు.

వైభవంగా రామయ్య పౌర్ణమి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారాముల ఉత్సవమూర్తులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా సీతారాముల ఉత్సవ మూర్తులకు అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాలయ అవరణలో ప్రత్యేక కళ్యాణ వేదికను ఏర్పాటు చేశారు. సీతా రాముల ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలు, బంగారు ఆభరణాలు, తులసి గజమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వీణా రాఘవాచార్యులు , అర్చకులు వీణా మనోజ్‌కుమార్‌లు స్వామి వారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంక్రాంతి సెలవులు కావడంతో కల్యాణం కోదండ వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

రామయ్యను దర్శించుకున్న ప్రకాశం జిల్లా న్యాయమూర్తి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారిని సోమవారం ప్రకాశం జిల్లా న్యాయమూర్తి ఎ. భారతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.బాలాలయంలో ఉన్న మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పల్లె ముంగిట.. కోళ్ల కోట్లాట..

- జిల్లాలో జోరుగా కోడి పందేలు
- జమ్మలమడుగు, పులివెందుల సబ్ డివిజన్‌ల పరిధిల్లో మితిమీరిన జూదం
- చేతులెత్తేసిన పోలీసులు

పండగ ముసుగులో పచ్చ నేతలు ‘బరి’ తెగించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని దగ్గరుండి మరీ కోళ్లను బరిలోకి దింపుతున్నారు. అక్కచెల్లెమ్మల ఆటలతో.. అవ్వాతాతల ముచ్చట్లతో.. ఎడ్లబండ్ల పోటీలతో.. సరదాగా సాగాల్సిన పల్లె ముంగిట కోడిపందేల కొట్లాటతో.. నేలచిందే కోళ్ల రక్తాలతో ఎరుపెక్కుతున్నాయి. చేతులు మారుతున్న కోట్ల రూపాయలతో జూద కేంద్రాలకు నెలవుగా మారాయి. ఇక కోడిపందేలకు అనుమతే లేదన్న ఖాకీల మాటలు ‘బరి’లోకి కాదు కదా.. గిరి గీసిన ఊరి పొలిమేరలోనే ఆగిపోయాయి.







అలవలపాడులో జోరుగా సాగుతున్న కోడి పందేలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లాకు మూడు నెలలుగా రెగ్యులర్‌గా ఎస్పీ స్థాయి అధికారి లేకపోవడంతో పేకాట, కోడిపందెం రాయుళ్లకు వరమైంది. ముఖ్యంగా సంక్రాంతి పేరిట బహిరంగంగా పందేలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో కొన్ని క్లబ్‌లకు టీడీపీ నేతలే అనధికారికంగా అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో జమ్మలమడుగు, పులివెందుల సబ్‌డివిజన్‌ల పరిధిల్లో మరీ విచ్చలవిడిగా జూదం, కోడిపందేలు సాగుతున్నాయి. పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో లింగాల, చక్రాయపేట, వేంపల్లి, తొండూరు, సింహాద్రిపురం, వేముల, ఆర్‌కే వ్యాలీ మండలాల పరిధిల్లోని కొన్ని మారుమూల, కొండలు, గుట్టల ప్రాంతాల్లో, తోటల ప్రాంతాల్లో జూదం నడిపిస్తున్నారని తెలుస్తోంది.

జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ....

వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో రామాపురం, లింగాల, ఒంటిమిట్ట, ముద్దనూరు, జమ్మలమడుగు, దువ్వూరు, బద్వేల్ మండలాలలోని తోటలను, వారికి అనువైన ప్రాంతాలను లీజుకు తీసుకుని మరీ కోడిపందేలను, పేకాటలాంటి జూదాలను ముమ్మరంగా నిర్వహిస్తున్నారని సమాచారం. జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు పోలీసులను అప్రమత్తం చేసినా నిర్వాహకులు మాత్రం తమ వంతుగా స్థానికంగా ఉన్న పలుకుబడితో యథేచ్ఛగా వారి అసాంఘిక కార్యకలాపాలను కొనసాగిస్తున్నారనీ తెలుస్తోంది. రెగ్యులర్‌గా ఎస్పీ లేడనే భావనతో కింది స్థాయిలో కొందరు పోలీసు అధికారులు, సిబ్బంది కూడా తమవంతుగా సహకారం అందిస్తూ, ప్రతిఫలంగా భారీ మొత్తంలో అక్రమార్జనలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. కడప నగరంలోని ఓ ప్రధాన పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి బరిలోకి దింపే నాటుకోళ్ల పెంపకం కోసం ఏకంగా తన ఇంటిపైభాగాన విడిదిని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ విషయం దాచి ఉంచేందుకు కొందరు పోలీసు అధికారులకు సైతం భారీగా మామూళ్లను అందిస్తూ, పోలీసు వర్గాలలోని కొందరిని తనకు ఎప్పటికపుడు పోలీచు ఉన్నతాధికారుల కదలికలను తెలియజేసేలా చూస్తున్నట్లు సమాచారం. ఈ నిర్వాహకుడు ఒంటిమిట్ట, నందలూరు, రామాపురం సరిహద్దు ప్రాంతాలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మరీ జూదం, కోడిపందేలను నిర్వహిస్తున్నాడనీ సమాచారం.

- జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది ఇప్పటికైనా తమవంతుగా గట్టిగా కోడిపందేలు, పేకాట నియంత్రణపై దృష్టిపెడితే పండుగ సమయంలోనైనా కొందరి జీవితాలను బుగ్గిపాలు కాకుండా ఆపగలిగిన వారవుతారని ప్రజలు కోరుకుంటున్నారు.

- వేంపల్లె మండల వ్యాప్తంగా కోడి పందేల నిర్వహణ జోరుగా సాగుతోంది. మండలంలోని అలవలపాడు, టి.వెలమవారిపల్లె గ్రామాలలో సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు లక్షల రూపాయలు కోడి పందేలు జరిగాయి. అలవలపాడు గ్రామంలో అధికార పార్టీకి చెందిన అన్నారెడ్డి బాలస్వామి రెడ్డి, అన్నారెడ్డి మరియానందరెడ్డిల ఆధ్వర్యంలో టి.వెలమవారిపల్లె గ్రామంలో రామాంజనేయ రెడ్డి, దొంతిరెడ్డి రాజుల ఆధ్వర్యంలో ఈ కోడి పందేలు జోరుగా కొనసాగుతున్నాయి. వారికి అధికార పార్టీ నేతలు భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. తాగునీరు, తదితర మౌలిక వసతులను కల్పించారు. నేడు మంగళవారం, బుధవారం అలవలపాడు గ్రామంతోపాటు గిడ్డంగివారి పల్లె, రామిరెడ్డిపల్లె గ్రామాలలో కోడి పందేలు, పేకాట, నిమ్మకాయ పందేలు తదితర పందేలు జరుగనున్నట్లు సమాచారం. ఒక ఆటకు రూ.20వేల నుంచి రూ.50వేల వరకు పందేలు కాస్తున్నారు. లక్షల రూపాయలు పందేలు కాసి పలు కుటుంబాల జీవితాలు నాశనమవుతున్నట్లు ఆ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▶▶ జోరుగా..



ఎర్రబల్లె కొత్తపల్లెలో జరుగుతున్న కోడి పందేలు

పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా కోడి పందేలను ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవిల ఆధ్వర్యంలో వారి అనుచరులు పోటాపోటీగా నిర్వహించారు. పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లె కొత్తపల్లె, ఎర్రిపల్లె, ఉలిమెల్ల, మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం ప్రాంతాలలో టెంట్లు, కుర్చీలు వేసి కోడి పందేలు నిర్వహించారు. కోడి పందేలు జరుగుతుండటంతో వేలాది మంది ప్రజలు భారీగా తరలి వచ్చారు. కోడి పందేల ద్వారా లక్షలాది రూపాయలు చేతులు మారాయి. గ్రామాల్లో సైతం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో విచ్చలవిడిగా కోడి పందేలను నిర్వహించారు.

▶▶ ఇదిగో బరి.. ఖాకీలేరి!

లింగాల మండలం దొండ్లవాగు గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. టీడీపీ మండల నాయకుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కోడి పందేలు కొనసాగుతున్నాయి. కడప, అనంతపురం తదితర జిల్లాల నుంచి కోడ పందేగాళ్లు కోడి పందేలు ఆడేందుకు భారీగా తరలి వచ్చారు. ఈ జూదంలో లక్షలాది రూపాయలు చేతుల మారినట్లు తెలుస్తోంది.



దొండ్లవాగు గ్రామంలో జోరుగా సాగుతున్న కోడి పందేలు

కనుల పండువగా గోదా కల్యాణం





పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం శ్రీ గోదాదేవి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా శ్రీ మహా విష్ణువు అంశయైన శ్రీ చెన్న కేశవ స్వామికి, శ్రీ మహా లక్ష్మి అంశయైన గోదాదేవికి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించబడిన ఆలయ మండపంలోని వేదికపై అలంకార భూషితులైన శ్రీ చెన్న కేశవ స్వామి, శ్రీ గోదాదేవిలు ఆశీనులవగా మంగళవాయిద్యాల నడుమ, వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు. ఈ సందర్భంగా కొండ ప్రాంగణం గోవిందనామ స్మరణతో మార్మోగింది. కాగా తెల్లవారు జామున ధనుర్మాస ప్రాతఃకాల పూజను నిర్వహించారు. ఉదయం స్వామివారికి బిందె తీర్థ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకట సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి 15 నుంచి ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నిత్యం కరువు వలసలు ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమకు కృష్ణా జలాల సాధన కోసం ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు కడపలో నిర్వహించనున్న ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమలో తగినంత వర్షపాతం నమోదు కాక ఏటా కరువు బారిన పడి చేసిన అప్పులు తీర్చలేక అవమాన భారంతో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి శాశ్వత పరిష్కారమైన కృష్ణా జలాలు రాయలసీమకు మళ్లించాలని ప్రజలు పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. పోరాటాల ఫలితంగా చేపట్టిన గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, రాజోలి, వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారన్నారు.ఈ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం నికరజలాలను కోల్పోవలసి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం, బెనకచర్ల ఎత్తిపోతల పథకం పేరుతో లక్షల కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నట్లు ప్రకటించడం చూస్తుంటే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న సీమ ప్రాజెక్టులను పూర్తి చేసే ఆలోచనలో లేనట్లు స్పష్టమవుతుందన్నారు. హక్కులు అవకాశాలను కోల్పోయి దగా పడ్డ వెనుకబడ్డ రాయలసీమ రైతాంగ మరోమారు నష్టపోకుండా ఉండేందుకు మరో మరో ఉద్యమానికి సమాయత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ప్రాజెక్టుల మహాసభకు నీటిపారుదల రంగ నిపుణులు, రైతు సంఘం జాతీయ నేతలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవీ సుబ్బారెడ్డి, పి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య

కళలను ఆదరించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : కళలను, సంస్కృతి, సాంప్రదాయాలను ఆదరించాలని భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలో నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయలసీమ సంగీత నృత్యోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాట్యవిశారద మొహిద్దీన్‌ఖాన్ 25 ఏళ్లుగా ప్రొద్దుటూరు పట్టణాన్ని కూచిపూడి నాట్యానికి వేదికగా మార్చారని పేర్కొన్నారు. ఎంతో మంది చిన్నారులకు నాట్యకళలో నిష్ణాతులుగా తీర్చిదిద్దారన్నారు. బీజేపీ రాష్ట్రసాంస్కృతికశాఖ కన్వీనర్ భానుప్రకాష్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం, ఉత్సాహం కలుగుతాయని వివరించారు. నటరాజ కళాక్షేత్రం నాట్యగురువు నాట్యవిశారద మోహిద్దీన్ ఖాన్ మాట్లాడుతూ నాట్య విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాయలసీమ స్థాయిలో ఈ వేడుకలను ఆడంబరంగా మూడు రోజుల పాటు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పలువురికి రాయలసీమ సంగీతరత్న, నాట్యరత్న అవార్డు అందించి సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, నాట్య కళాప్రపూర్ణ డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రదీప్‌రెడ్డి, రాయలసీమలోని పలు ప్రాంతాలకు చెందిన నాట్యగురువులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా భోగి

మొక్కుబడిగా సంక్రాంతి పండుగ



కడపలో భోగిమంటలు

కడప కల్చరల్ : సంక్రాంతి పండుగను జిల్లా అంతటా సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకున్నారు. సోమవారం తొలి రోజు భోగి పండుగను పలు వర్గాల ప్రజలు కుటుంబాలతో బంధుమిత్రులతో కలిసి జరుపుకున్నారు. తెల్లవారు జామున గ్రామాల్లోని ప్రజలు చెత్త చెదారం పోగేసి భోగి మంటలు వేశామనిపించారు. సంక్రాంతి సంప్రదాయాలను ఘనంగా నిర్వహించాల్సి ఉన్న మొక్కుబడిగా మాత్ర నిర్వహించాల్సి రావడంతో పండుగ ఒకింత నిరాశగా సాగింది. మార్కెట్లలో భోగి పండ్లు ధర చుక్కలను అంటడంతో పలు చోట్ల చిన్నారులకు పిడికెడు పండ్లుతో సంప్రదాయాన్ని నిర్వహించారు. ఇక గంగిరెద్దుల సందడి మాత్రం పూర్తిగా తగ్గింది. అక్కడక్కడ కనిపించిన ఈ సారి గో పూజలు కరువయ్యాయి. పలు చోట్ల మహిళలు, యువతులు పండుగ సంప్రదాయాలను తోసిరాజనక ఉన్నంతలో రంగు రంగుల వల్లులను ఇళ్ల అలంకారంగా తీర్చిదిద్దారు. యువత ఉన్న చోట మిత్రులందరిని పొగ్గేసి గ్రామం మధ్యన, ఊరి బయట పెద్దగా భోగి మంట వేసి ఆడిపాడి ఆనందించారు, పట్టణాలు, నగరంలోని అపార్ట్‌మెంట్‌ల వద్ద ప్రజలు సామూహికంగా భోగి మంటలు వేసి కలిసి మెలిసి గోబెమ్మ పాటలు ఆలపిస్తూ మంట చుట్టూ తిరుగుతూ చప్పట్లు చరుస్తూ ఉన్నంతలో సంతోషాలను పంచుకున్నారు.

నగరంలో.....

కడప నగరంలోని బుద్దా టౌన్‌షిప్ రెడ్డి సేవా సమితి, ఆర్ట్స్ కళాశాల, తదితర మైదానాలల్లో యువత భోగి మంటలతో ఆనందించారు. దేవుని కడప ఆలయంలో, మున్సిపల్ మైదానంలోని రాజేశ్వరి ఆలయంలో, గడ్డి బజార్‌లోని శ్రీ లక్ష్మీ సత్యనారాయణ స్వామి ఆలయం, శివాలయంతో పాటు నగరంలోని అన్ని ప్రధాన ఆలయాల్లో కూడ ప్రాకురాల ఆలాపనలతో పూజలు నిర్వహించారు.

డీఎస్పీ ఔట్..ఏఎస్పీ ఇన్!

ఐపీఎస్ అధికారి మనోజ్‌రామనాథ్‌హెగ్డే నియమాకం



రాజంపేట : ఇప్పటి వరకు రాజంపేట సబ్‌డివిజన్‌కు ఎస్‌డీపీఓ(డీఎస్పీ) క్యాడర్ కొనసాగుతూ వచ్చింది. డీఎస్పీ హోదా పోయి, ఇప్పుడు తొలిసారిగా ఐపీఎస్ హోదా కలిగిన ఏఎస్పీ వచ్చారు. ఇప్పటి వరకు రాజంపేట డీఎస్పీలుగా 28 మంది పనిచేశారు.అయితే ఇప్పుడు ఐపీఎస్ అధికారి నియమాకంతో రాజంపేట సబ్‌డివిజన్ రూపురేఖలు మారనున్నాయి.

ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల నిలయం

రాజంపేట ఇప్పుడు ఐఏఎస్, ఐపీఎస్‌ఐ, ఐఎఫ్ఎస్ అధికారుల నిలయంగా మారింది. ఒకరంగా జిల్లాకేంద్రంలో ఉండే అత్యున్నతస్థాయి అధికారులు కీలకమైన శాఖకు పనిచేయడం చర్చనీయాంశమైంది.ఇప్పటికే ఇక్కడ ఐఏఎస్ హోదా కలిగిన సబ్‌కలెక్టర్ వైఖోమానై దియాదేవి, రాజంపేట కేంద్రంగా జిల్లా అటవీశాఖ అధికారిగా ఐఎఫ్ఎస్ అధికారి జగన్నాథ్‌సింగ్ కొనసాగుతున్నారు. పోలీసుశాఖకు సంబంధించి ఐపీఎస్ అధికారిని ప్రభుత్వం నియమించడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం. ఇక్కడ డీఎస్పీగా సుధాకర్ పనిచేస్తున్నారు. ఈయనను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

ఏఎస్పీగా మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే

రాజంపేట ఏఎస్పీగా మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డేను ప్రభుత్వం నూతనంగా నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా పనిచేశారు. ఈయనను ఏఎస్పీగా రాజంపేట సబ్‌డివిజన్‌కు బదిలీ చేసింది. ఈయన 2022 బ్యాచ్‌కు చెందినవారుగా చెపుతున్నారు.

ఎందుకు ఐపీఎస్‌ను వేయాల్సి వచ్చింది

గ్రూప్–1 స్థాయి అధికారినే రాజంపేట ఎస్‌డీపీఓగా నియమిస్తూ వచ్చారు. లేకపోతే డిపార్టుమెంట్‌లో పదోన్నతిపై వచ్చిన వారే ఎస్‌డీపీఓగా నియమితులయ్యేవారు. ఇప్పుడు ఐపీఎస్ స్థాయి హోదా కలిగిన అధికారిని నియమించడంపై అనుమానాలు పోలీసువర్గాల్లో రేకెత్తిస్తున్నాయి.గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్, నేరాలు లాంటివి పెరిగిపోతున్నాయా అనే కోణంలో ఏఎస్పీని ప్రభుత్వం నియమించినట్లుగా పోలీసువర్గాలు భావిస్తున్నాయి. ఏదీఏమైనప్పటికి రాజంపేట ఏఎస్పీని ప్రభుత్వం నియమించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు



నిందితుడితో ఏఎస్ఐ నాగేంద్రప్రసాద్

చాపాడు : మండలంలోని మొర్రాయిపల్లె క్రాస్ రోడ్డు వద్ద దొంగతనానికి పాల్పడిన కోపెర్ల ప్రసన్న కుమార్ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ టి.నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఈ నెల 6వ తేదీన మొర్రాయిపల్లె గ్రామానికి చెందిన బిర్రు చెంగ్రాయుడు అనే వ్యక్తి ఇంట్లో రూ.2లక్షలు విలువ చేసే బంగారు చోరీకి గురైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా ఇదే గ్రామానికి చెందిన ప్రసన్న కుమార్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. సోమవారం నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ.2లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మదనపల్లె : ప్రైవేటు బస్సు ఢీకొని భార్యాభర్తలు గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని చీకలిగుట్టకు చెందిన రమణ (55), అతని భార్య అంజమ్మ(45) సోమవారం చీకలబైలు పంచాయతీ తిప్పిరెడ్డిగారిపల్లెలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలోని చిప్పిలి సమీపంలో స్థానికంగా ఉన్న ఫుడ్‌ఫ్యాక్టరీకి చెందిన బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో రమణ, అంజమ్మ గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కొత్తిండ్లులో చోరీ

మదనపల్లె : మదనపల్లె మండలంలోని కొత్తిండ్లులోని ఓ ఇంటిలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడి రూ.4.5 లక్షల విలువైన నగదు, నగలు చోరీ చేసుకుని వెళ్లారు. వివరాలు ఇలా.. కొత్తిండ్లులో నివాసమున్న అక్బర్ స్థానికంగా టైలర్ పని చేస్తూ జీవిస్తున్నాడు. అతని బంధువులు ఇటీవల ఉమ్రాకు వెళుతుండగా వారిని సాగనంపేందుకు కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. కార్యక్రమం అనంతరం ఆదివారం రాత్రి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగిలి ఉండటంతో అనుమానం వచ్చి ఇంట్లో పరిశీలించాడు. వస్తువులన్నీ చిందరవందరగా పడిఉండటం, బీరువా, కప్‌బోర్డులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నాడు. అనంతరం ఆదివారం రాత్రి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆరు పదుల వయస్సులోనూ తగ్గేదేలే.!

- భోగి పండుగ.. ఆత్మీయ కలయికకు వేదిక
- హోదాలు.. వయోభేదాలు పక్కన పెట్టి..
- ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌తో సందడి చేసిన మాజీ క్రీడాకారులు



ఆర్‌సీసీ మాజీ క్రీడాకారులు

రాజంపేట టౌన్ : ఐదు పదుల వయస్సు దాటితేనే శరీరంలో సత్తువ తగ్గుతూ వస్తుంది. ఇక ఆరుపదుల వయస్సు దాటితే చిన్నపని చేసినా అలసట వస్తుంది. అయితే రాజంపేట క్రికెట్ క్లబ్ (ఆర్‌సీసీ) మాజీ క్రీడాకారుల్లో భోగిపండుగ రోజు అలసట, శారీరక శ్రమ అన్నవి ఏమాత్రం కనిపించవు అంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. అందుకు కారణం చిన్ననాటి క్రీడామిత్రులను కలుసుకోవడమే. సంక్రాంతి సందర్భంగా అపూర్వ సమ్మేళనాల పేరిట చిన్ననాటి మిత్రులు కలుసుకుంటుండటం ఇప్పుడు సర్వసాధారణమైంది. అయితే క్రికెట్ క్రీడ వల్ల పరిచయమైన చిన్ననాటి స్నేహితులు చిన్నప్పుడు వారు క్రికెట్ ఆడిన క్రీడామైదానంలోనే గత ఐదు సంవత్సరాలుగా భోగి పండుగ రోజున సరదాగా క్రికెట్ ఆడి అలనాటి తీపి గుర్తులను నెమరువేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మాజీ క్రీడాకారులు ప్రతి ఏటా భోగిపండుగ రోజు విధిగా కలుసుకుంటుండటం ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ఈ ఏడాది కూడా భోగి పండుగను పురస్కరించుకొని సోమవారం మాజీ క్రికెట్ క్రీడాకారులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ మ్యాచ్ ఆడి చిన్ననాటి స్నేహంలోని మాధుర్యాన్ని ఆస్వాదించారు. ఈ మ్యాచ్‌లో ఒక జట్టుకు వడ్డే రమణ కెప్టెన్‌గా వ్యవహరించగా మరో జట్టుకు షేక్ అబ్దుల్లా కెప్టెన్‌గా వ్యవహరించారు. తొలుత బ్యాటింగ్ చేసిన అబ్దుల్లా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వడ్డె రమణ జట్టు 9 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేయడంతో మ్యాచ్ టైగా ముగిసింది. ఈ క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు తరలి రావడం విశేషం. వీరిలో దాదాపు అందరు ఐదు, ఆరు పదుల వయస్సు పైబడిన వారే కావడం మరింత విశేషంగా చెప్పుకోవాలి. నాలుగు దశాబ్దాల క్రితం రాజంపేట క్రికెట్ క్లబ్ (ఆర్‌సీసీ) ఏర్పాటై రాయలసీమలోనే ప్రసిద్ధి గాంచిన క్రికెట్ జట్టుగా గుర్తింపు పొందింది. గత ఐదు సంవత్సరాలుగా ప్రతి ఏడాది భోగి పండుగ రోజున ఆర్‌సీసీ మాజీ క్రీడాకారులు కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానం వేదికవుతోంది.

అదే ఆర్‌సీసీ గొప్పతనం



నాలుగు దశాబ్దాల క్రితం రాజంపేట క్రికెట్ క్లబ్ (ఆర్‌సీసీ) ఆవిర్భవించి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. రెండున్నర దశాబ్దాల పాటు ఆర్‌సీసీ ప్రభ కొనసాగింది. ఎంతో మంది క్రీడాకారులు ప్రతిభను చాటి రాయలసీమకే గుర్తింపు తీసుకొచ్చారు. ప్రతి ఏడాది భోగి పండుగ సందర్భంగా మాజీ క్రీడాకారులందరు కలిసి మ్యాచ్ ఆడుతుండటం ఆర్‌సీసీ గొప్పతనం అని చెప్పాలి.

– పోలా శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, ఆర్‌సీసీ మాజీ ఆటగాడు, రాజంపేట

ఎంతో గర్వంగా ఉంది



ఆర్‌సీసీ ఆవిర్భావంలో నా భాగస్వామ్యం కూడా ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. దాదాపు 40 సంవత్సరాలైనా ఆర్‌సీసీ ద్వారా క్రికెట్ మ్యాచ్‌లు ఆడిన వారిలో ఏ మాత్రం ఉత్సాహం తగ్గలేదు. ఆరు పదుల వయస్సు పైబడినా పాత మిత్రులతో కలిసి క్రికెట్ ఆడేందుకు ఎక్కడెక్కడి నుంచో వస్తున్నారు.

– షేక్ అబ్దుల్లా, ఆర్‌సీసీ మాజీ ఆటగాడు, రాజంపేట

థ్యాంక్ గాడ్



ఏడాదికి ఒకసారి ఆర్‌సీసీ మాజీ క్రీడాకారులు తాము క్రికెట్ సాధన చేసిన మైదానంలోనే కలుసుకుంటుండటం మాటల్లో చెప్పలేని ఆనందకరమైన విషయం. చిన్ననాటి క్రీడా మిత్రులు ఎక్కడ ఉన్నా వ్యయ ప్రయాసల కోర్చి విధిగా భోగి పండుగ రోజు క్రికెట్ మ్యాచ్ ఆడటం కోసం వస్తుండటం చాలా గొప్ప విషయం. ఈ విషయంలో మేము భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము.

– దయానంద్, లెక్చరర్, హిందూపురం

ఆర్‌సీసీ పేరు వింటేనే వైబ్రేషన్



ఆర్‌సీసీ ప్లేయర్స్‌లో కొంత మందికి ఆరుపదుల వయస్సు పైబడింది. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ప్రయాణం చేసి రాజంపేటకు రావాలంటే శారీరకంగా కాస్త అలసటగా కూడా ఉంటుంది. అయితే ఆర్‌సీసీ పేరు వినగానే ఆర్‌సీసీ ద్వారా క్రికెట్ ఆడిన ప్రతి ఒక్కరిలో వైబ్రేషన్స్ వస్తాయి. ఆ వైబ్రేషన్ వల్ల శారీరక శ్రమ దూదిపింజెలా ఎగిరిపోతుంది.

– దేవేంద్రనాథ్, రిటైర్డ్ చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్, తిరుపతి

గాలిపటం ఎగరేస్తుండగా విద్యుత్ షాక్

బాలుడికి తీవ్ర గాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న ఓ బాలుడు (10) గాలిపటం ఎగరేస్తుండగా అకస్మాత్తుగా ఇంటిపైకి ఎక్కాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్‌కు గురవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని బంధువులు రిమ్స్‌కు తరలించారు. వైద్యుల సూచన మేరకు వెంటనే కర్నూలుకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

బాకీ విషయమై ఘర్షణ

వ్యక్తి మృతి

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం నంది మండలం గ్రామంలో ఆదివారం రాత్రి బాకీ విషయమై జరిగిన ఘర్షణలో యార్లోపల్లె సుబ్బరాయుడు(50) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. సుబ్బరాయుడు కుమారుడు నాగసుబ్బయ్య అల్లు వంశీ అనే వ్యక్తికి అవసర నిమిత్తం డబ్బులు ఇచ్చాడు. ఆ డబ్బులు తిరిగి ఇవ్వమని అడగ్గా అక్కడ మాటా మాటా పెరిగి ఇరువురు ఘర్షణ పడ్డారు.

ఈ సమయంలో సుబ్బరాయుడుకు గాయాలయ్యాయి. 108 వాహనంలో వేంపల్లె ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా వంశీ, అతని తల్లి ఈశ్వరమ్మతో గొడవ పడుతుంటే సుబ్బరాయుడు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించాడన్నారు. ఆ క్రమంలో కాలికి మొద్దు తగిలి కింద పడి మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారన్నారు.

పోటా పోటీగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



పోటీలలో ప్రథమ బహుమతిని దక్కించుకున్న ఎద్దులు

ప్రారంభించిన ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట రూరల్ : సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక ఆకేపాటి ఎస్టేట్‌లో సోమవారం ఆకేపాటి లక్ష్మిరెడ్డి, అనసూయమ్మల జ్ఞాపకార్థం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి బండలాగుడు పోటీలు నిర్వహించారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని ఎద్దు పోటీ పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వ మాజీ వ్యవసాయ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను వీక్షించేందుకు వచ్చిన వందలాది మందితో ఆకేపాటి ఎస్టేట్‌లో పండుగ వాతావరణం వెల్లివిరిసింది. ప్రజలందరికీ ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి భోజన సదుపాయం కల్పించారు. వైఎస్సార్ జిల్లా ఆలంఖాన్‌పల్లికి చెందిన రెడ్డిచెర్ల వెంకట్రామిరెడ్డి, రూకవారిపల్లికి చెందిన విద్య ఓబుల్‌రెడ్డిల ఎద్లకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, వైఎస్సార్ జిల్లా లసింగాయపల్లికి చెందిన మేడా వంశీరెడ్డి, తుడుమలదిన్నెకు చెందిన చందా హేమంత్‌రెడ్డిల ఎద్లకు ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, వైఎస్సార్ జిల్లా బాలయ్యగారిపల్లికి చెందిన నంద్యాల విష్ణువర్దన్‌రెడ్డి ఎద్లకు తృతీయ బహుమతిగా రూ.30 వేలు, వైఎస్సార్ జిల్లా పెండ్లిమర్రి మండలం తిప్పిరెడ్డిపల్లికి చెందిన వడ్డెమాను విశ్వనాథరెడ్డి ఎద్లకు నాలుగవ బహుమతిగా రూ. 20వేలు, వైఎస్సార్ జిల్లాలోని ఖాదర్‌ఖాన్ కొట్టాలకు చెందిన డి.భావనకు చెందిన ఎద్లకు 5వ బహుమతిగా రూ.10 వేలు అందజేశారు. పోటీలో పాల్గొన్న మిగతా ఎద్లకు రూ.5వేలు చొప్పున ఎమ్మెల్యే ఆకేపాటి అందజేశారు. ఈ వేడుకల్లో టీటీడీ మాజీ బోర్డు మెంబర్ మాసీమ బాబు, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ కథ కంచికేనా.?

ఐదురోజులైనా చర్యలు కరువు



గుర్రంకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న రేషన్ బియ్యం లారీ

గుర్రంకొండ : గుర్రంకొండలో పట్టుబడిన రేషన్ బియ్యం లారీ కథ కంచికేనా అంటూ గ్రామస్తులు చర్చించుకొంటున్నారు. విజిలెన్స్ పోలీసులు ఐదు రోజుల క్రితం 30 టన్నుల రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకుని గుర్రంకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు. అయితే ఐదు రోజులుగా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కడప–బెంగళూరు జాతీయ రహదారి పక్కనే పోలీస్ స్టేషన్ ఎదుట దిష్టిబొమ్మలా అందరికి దర్శనమిస్తోంది. జమ్మలమడుగు నుంచి రేషన్ బియ్యం బస్తాలు లోడు చేసుకొని ఓ లారీ బయలు దేరి కర్ణాటక వైపు వెళ్తుండగా జిల్లా విజిలెన్స్ పోలీసులు లారీని వెంబడించి గుర్రంకొండ వద్ద అదుపులోకి తీసుకొన్నారు. బియ్యం లారీని స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉంచి వెళ్లిపోయారు. బియ్యం లారీకి రికార్డులు సరిగ్గా ఉన్నాయా లేదా అవి అసలు రేషన్ బియ్యమేనా, బియ్యాన్ని ఎగుమతి చేసేందుకు అధికారుల అనుమతి ఉందా అన్న కోణంలో జిల్లా రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అయితే విచారణ సాగతీత ధోరణిలో సాగుతుండడంతో ఐదు రోజులుగా బియ్యం లారీ పోలీస్ స్టేషన్ వద్దే ఉంది. రికార్డులు సరిగ్గా ఉంటే అవి రేషన్ బియ్యం కాకపోతే ఇన్ని రోజులు ఎందుకు పోలీస్ స్టేషన్ వద్ద ఉంచారు అన్న సందేహాలు జనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు బియ్యం లారీ కథ కంచికి వెళ్లకుండానే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎస్ఐ మధు రామచంద్రుడును వివరణ కోరగా రేషన్ బియ్యం లారీ విషయం తమ పరిధిలో లేదని ఈ కేసు జిల్లా అధికారులు విచారిస్తున్నారని తెలిపారు. వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయన్నారు.

మదనపల్లె మెడికల్ కాలేజీ ప్రైవేటు పరం చేయొద్దు

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కాలేజీని ప్రభుత్వం ప్రైవేటు పరం చేయొద్దని, ఆసుపత్రి సిబ్బంది బదిలీలు రద్దుచేసి వారిని కొనసాగించాలని, సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. సోమవారం మదనపల్లె సర్వజన బోధన ఆసుపత్రి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మదనపల్లె మెడికల్ కాలేజీని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి గత వందేళ్లుగా ఎంతో మంది పేద రోగులకు వైద్య చికిత్స అందించి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. రోజుకు 1,200 నుంచి 1,500 మంది అవుట్ పేషెంట్లుగా వైద్య సేవలు పొందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలకు గ్రహణం పట్టిందని, స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఆస్పత్రిలోని 44 మంది వైద్యులను ఇప్పటికే బదిలీ చేయగా, మరో 23 మంది స్టాఫ్‌నర్సులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మదనపల్లె మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించకపోతే, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి, సీఐటీయూ నాయకుడు ప్రభాకర్, న్యాయవాది సోమశేఖర్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి కూలీ మృతి

పిల్లలతో కలిసి దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



బాలాజీ (ఫైల్)

మదనపల్లె : పిల్లలతో కలిసి ఓ కూలి దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా, బైక్ అదుపు తప్పి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో జరిగింది. పుంగనూరు పట్టణం బాలాజీ సినిమా థియేటర్ వద్ద నివాసం ఉన్న ఈశ్వర, రాజేశ్వరి దంపతుల కుమారుడు బాలాజీ(46) స్థానికంగా కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. అతనికి భార్య బేబి, కుమార్తె మహేశ్వరి, కుమారుడు హర్షవర్దన్ ఉన్నారు. బాలాజీ అయ్యప్ప మాలధారణ చేసి రెండు రోజుల క్రితం దీక్ష విరమించాడు. ఈ నేపథ్యంలో తన ఇద్దరు పిల్లలతో కలిసి బోయకొండ ఆలయానికి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. అక్కడ అమ్మవారికి తలనీలాలు సమర్పించి దైవదర్శనం ముగించుకుని తిరిగి పుంగనూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని కొలిమిపల్లి సమీపంలో ఎదురుగా బస్సు రావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపు తప్పి పిల్లలు ఒకవైపు, బాలాజీ మరోవైపు పడిపోయారు. బాలాజీ తలకు గాయమై తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు.

మాంసంతో జర జాగ్రత్త !

- పండగ మాటున నాణ్యత లేని మాంసం విక్రయాలు
- తూకాల్లోనూ మోసగిస్తున్నట్లు ఆరోపణలు
- పశు వైద్యాధికారుల ధ్రువీకరణ లేకుండా జీవాల వధ
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం.. పట్టించునే వారే కరువు



విక్రయానికి సిద్ధంగా ఉన్న మాంసం

కడప అగ్రికల్చర్ : ముక్క లేనిదే ముద్ద దిగని మాంసం ప్రియుల సంఖ్య జిల్లాలో భారీగానే ఉంది. ఆదివారం, మంగళవారం, బుధవారం రోజుల్లో చాలా చోట్ల మాంసం విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. అయితే తాము కొనుగోలు చేస్తున్న మాంసం నాణ్యమైనదా కాదా అని గుర్తించలేని పరిస్థితి చాలా చోట్ల నెలకొంది. అలాంటి వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కనీస ప్రమాణాలు కూడా పాటించకుండా నాణ్యత లేని మాంసం విక్రయాలను సాగిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. వీటితోపాటు జీవాలను వధించే ప్రదేశాల్లో శుభ్రత పాటించకపోగా అపరిశుభ్రమైన నీటితో జీవాల దట్టాలను శుభ్రం చేయడం, రోగాల బారిన పడిన జీవాలను వధించి మాంసాన్ని విక్రయించడం చేస్తూ జనాల నుంచి డబ్బులను గుంజుతున్నారు. ఇంత జరుగుతున్నా ఇదేంటని ప్రశ్నించేవారే కరువయ్యారు.

ఈనెల 15వ తేదీ తెలుగువారి అతి ముఖ్యమైన పండగ సంక్రాంతి సందర్భంగా మాంసం విక్రయాలు మరింత రోజుగా సాగుతాయి.

అనుమతి లేకుండా దుకాణాలు..

కడప నగరంతోపాటు చాలా నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలలో లైసెన్సు పొందిన మాసం దుకాణాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మాంసం దుకాణాలు కోకొల్లలు. కడప జిల్లాలో ఆది, మంగళ, బుధవారాల్లో వేల క్వింటాళ్లలో మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. ఇక పండగలు, తిరుణాళ్లకైతే చెప్పాల్సిన పనే లేదు. కిలో పొట్టేలు మాంసం ప్రాంతాలను బట్టి రూ.700 నుంచి వెయ్యి రూపాయల వరకు అమ్ముతున్నారు.

నిబంధనల ప్రకారం..

నిబంధనల ప్రకారం పశు వైద్యాధికారులు పరిశీలన చేసి ఆరోగ్యకరమైన పొట్టేలు అని ధ్రువీకరించిన తర్వాతే వ్యాపారులు పొట్టేలు కానీ మేకపోతులు కానీ కోసి విక్రయాలను సాగించాలి. మాంసం విక్రయాలకు షాపుల్లో ఉంచినప్పుడు దుమ్ము, ధూళి, దోమలు, ఈగలు వాలకుండా వాటిపై తెర కప్పి ఉంచాల్సి ఉంది. కానీ జిల్లాలో ఇలాంటి పరిస్థితి మచ్చుకు కొన్ని చోట్ల తప్పితే ఎక్కడా కొనసాగించడం లేదు. దీనికితోడు కొంతమంది వ్యాపారులు పొట్టేళ్లకు బదులుగా గొర్రెలు, మేకలు కోసి పొట్టేళ్ల మాంసం అని చెప్పి విక్రయిస్తూ కల్తీ మాంసాన్ని అంటగడుతున్నారు. దీంతోపాటు కొన్ని చోట్ల తూకాల్లో సైతం మోసాలు చేస్తున్నారని, నాణ్యత లేని మాంసాన్ని చౌక ధరకు హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.


నిల్వ ఉన్న మాంసం..

కొందరు వ్యాపారులు ముందు రోజు అమ్మకాల్లో మిగిలిన మాంసాన్ని ఐస్‌బాక్సుల్లో నిల్వ ఉంచి మరుసటి రోజు కూడా అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇదిలా ఉంటే పశు వైద్యాధికారులు పొట్టేళ్లను పరిశీలించి ఆ పొట్టేలు ఆరోగ్యకరమైనదా కాదా అని నిర్ధారించేందుకు నెలనెలా సర్‌చార్జి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి సర్‌చార్జీలు చెల్లించకపోవడంతో పశువైద్యులు పరిశీలనకు వెళ్లనట్లు తెలిసింది. నగరపాలక, మున్సిపాలిటీల్లో ఇలాంటి పర్యవేక్షణకు ప్రత్యేక పశు వైద్యాధికారులు ఉండాలి. కానీ అలాంటి పోస్టులు జిల్లాలో ఎక్కడా లేవు.

కానరాని పరిశుభ్రత..

జీవాలు వధించే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలి. పైగా నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో మాంసం విక్రయాలను చేయకూడదు. మాంసం దుకాణాల ప్రాంగణంలో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతోపాటు లోపలి ప్రాంతాన్ని ఫినాయిల్‌తో క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. దీంతోపాటు మాంసాన్ని కొట్టేవారు గోర్లను పెంచుకోకూడదు. వారికి ఎలాంటి చర్మవ్యాధులు ఉండకూడదు. దీంతోపాటు మాంసం కోసేందుకు ఉపయోగించే కత్తులు, చాకులతోపాటు పాత్రలు రోజు వేడినీటితో శుభ్రం చేయాలి. ఇది ఎక్కడా జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కచ్చితంగా నిబంధనలు పాటించాలి



మాంసం వ్యాపారులు కచ్చితంగా నిబంధనలను పాటించాలి. పశు వైద్యాధికారుల పర్యవేక్షణలోనే పొట్టేళ్లు కోయాలి. వారు ధ్రువీకరించిన మాంసాన్నే వ్యాపారులు విక్రయించాల్సి ఉంటుంది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కల్తీ లేని మాంసం అందించాలి. ఈ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ శారదమ్మ, జిల్లా పశు సంవర్థకశాఖ అధికారి

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బి.కొత్తకోట : స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్ గంగనాథ్‌బాబు తెలిపారు. స్థానికురాలైన దిల్షాద్ (56) కాలనీకి సమీపంలోని బీడు పొలాల్లో ఆదివారం రాత్రి మృతి చెంది ఉండగా గుర్తించారు. మృతురాలి శరీరంపై గీక్కుపోయిన గుర్తులు ఉన్నట్టు పోలీసులు గమనించారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతురాలి కుమార్తె హసీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తరలించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పుల్లంపేట : పుల్లంపేట మండలం అనంతసముద్రం గ్రామ పరిధిలోని కందిరీగల గుట్ట వద్ద ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్న 12 మందిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8 లక్షలు విలువ చేసే 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను రాజంపేట డీఎస్పీ సుధాకర్ వెల్లడించారు. ఈ సమావేశంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, నందలూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.